
దుమ్ముగూడెం: వర్షపునీటితో నిండిన వరి పొలాలు


దమ్మపేట మండలంలో మోకాలిలోతు వర్షపు నీటిలో కర్ర సాయంతో వెళ్తున్న వృద్ధులు

# వాన కురిసింది.. నేల తడిచింది..

**ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం**

- కొన్ని మండలాల్లో మోస్తరు జల్లులు
- పర్ణశాలలో నీటమునిగిన సీతమ్మ నారచీరెలు
- సింగరేణి ఓసీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- సత్తుపల్లి ప్రాంతంలో 93 మి.మీ. వర్షపాతం

శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ ఉమ్మడి ఖమ్మం జిలాల్లో వర్షం కురిసింది. మరికొన్ని చోట్ల ఆదివారం రాత్రి దాకా కూడా పలు మోస్తరు వర్షం కురిసింది. ఇంకొన్ని చోట్ల మోస్తరు జల్లులు పడ్డాయి. ఎట్టకేలకు వాన కురిసి నేల తడవడంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పత్తి విత్తనాలు వేసి ఆకాశం వైపు చూసిన రైతన్నల మోములో ఈ వర్షపు జల్లులు ఆశలను మొలకెత్తించాయి. ముఖ్యంగా భద్రాద్రి జిల్లా అంతాటా వర్షం కురిసినట్లయింది. దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో సీత వాగు పొంగింది. దీంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో చారిత్రక నారచీరెల ప్రాంతం పూర్తిగా నీట మునిగింది. ఆదివారం పర్ణశాల రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులు నారచీరెల ప్రాంతాన్ని దర్శించకుండానే వెదిరిగారు. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి సింగరేణి ఇల్లెందు కోయగూడెం ఓసీలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. 8 వేల టన్నుల మేర బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. కొత్తగూడెం ఏరియాలో కూడా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సత్తుపల్లి ఓసీల్లోకి కూడా భారీగా వర్షపు నీరు చేరింది. అక్కడ బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. దీంతో సింగరేణి అధికారులు బొగ్గు ఉత్పత్తి పనులను నిలిపివేశారు. సింగరేణి ప్రాంతంలో 93 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడెంలో ఆదివారపు సంతలోని వ్యాపారులు, సంతకు వచ్చి వినియోగదారులు తడిసిపోయారు. దుమ్ముగూడెం మండలంలో పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. అదే మండలంలోని సీతారాంపురంలో భారీ వర్షానికి ఓ చెట్టు నేల కూలింది. సత్తుపల్లి డివిజన్‌లో 64.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుబల్లి మండలంలో పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వీఎం బంజర బస్టాండ్ ఆవరణ చెరువును తలపించింది. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. మణుగూరులోనూ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు వాటిని బకెట్లతో ఎత్తి బయటకు పోశారు. *– నమస్తే నెట్‌వర్క్, జూన్ 23*


మణుగూరు టౌన్: వినాయక నగర్‌లో చేరిన వర్షపు నీరు


నిండుగా ప్రవహిస్తున్న సీతవాగు


దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో సీతవాగు పొంగడంతో నీటమునిగిన సీతమ్మ నారచీరెల ప్రాంతం


దుమ్ముగూడెం: సీతారాంపురంలో రోడ్డుపై కూలిన చెట్టు


పెనుబల్లి: చెరువును తలపిస్తున్న వీఎం బంజర బస్టాండ్ ప్రాంగణం


మణుగూరు టౌన్: సత్యభామ్యర చిత్రమందిర్ వీధిలో ఇంట్లోకి చేరిన నీటిని బకెట్‌తో ఎత్తిపోస్తున్న చిన్నారి


సత్తుపల్లి: వర్షం కురుస్తుండడంతో రోడ్డు వెంట ఉన్న గుడారాల్లోకి చేరుతున్న నీరు

## బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా 'వద్దిరాజు'

ఖమ్మం/ రఘునాథపాలెం, జూన్ 23: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) ఆదివారం నియమించారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆశీస్సులతో ఆయన ఇటీవలే మరోసారి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. బీసీ వర్గానికి చెందిన రవిచంద్రను.. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేతగా నియమించడం పట్ల ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బీసీ నాయకులు, అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, తనను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా ఎంపిక చేసిన పార్టీ అధినేత కేసీఆర్‌కు రవిచంద్ర ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

## చిరుమళ్ల వంతెన మరమ్మతుకు చర్యలు

- భద్రాద్రి కలెక్టర్ జితేశ్ పాటిల్

కరకగూడెం, జూన్ 23: మండలంలోని చిరుమళ్ల వంతెన మరమ్మతుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ జితేష్ వీ పాటిల్ తెలిపారు. గతేడాది వానకాలంలో చిరుమళ్ల వంతెన వరద తాకిడికి కొట్టుకుపోయింది. దీంతో కరకగూడెం– చిరుమళ్ల మధ్య రాకపోకలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈక్రమంలో ఆదివారం కలెక్టర్ చిరుమళ్ల వంతెనను అధికారులతో కలిసి పరిశీలించారు. మొదటిసారి మండలానికి వచ్చిన కలెక్టర్‌కు అధికారులు ఘనస్వాగతం పలికారు. వంతెన మరమ్మతుల ఆలస్యానికి గల కారణాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా వంతెన నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగప్రసాద్, పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చిరుమళ్ల వంతెనను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్

## వసతిగృహాల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మామిళ్లగూడెం, జూన్ 23: ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్ సంబంధిత వార్డెన్లను ఆదేశించారు. ఆదివారం నగరంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలుర, బీసీ, ఆనందనిలయం వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్య, సిబ్బంది వివరాలు వార్డెన్‌లను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్‌హాల్, కిచెన్‌లను పరిశీలించారు. స్టోర్స్‌లో వంట సామగ్రిని పరిశీలించారు. కూరల్లో వాడే కారంను పరిశీలించి శాంపిల్ తీసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలు, మెనూను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రతను పాటించాలని, సరిపోను వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతిగృహ విద్యార్థులను భోజనం, చదువు, ఏవైనా సమస్యలు ఉన్నయా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మంచాలు వెనుక భాగంలో బయట ఉండడాన్ని గమనించి వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పనికిరాని వాటిని స్క్రాప్‌గా తీసివేయాలని ఆదేశించారు. బయటి వ్యక్తులను హాస్టల్లోనికి అనుమతించరాదని సూచించారు. నిర్వహణ లోపాలను సహించేది లేదని, లోపాలు ఉంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


హాస్టల్ కిచెన్‌ను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

## అనర్హుల పింఛన్లు, రేషన్‌కార్డులు రద్దుచేస్తాం

**తెలంగాణ ప్రభుత్వం.. పేదల ప్రభుత్వం**

**ఆగస్టులోగా రూ.2 లక్షల్లోపు రుణమాఫీ పూర్తి**

**ఖమ్మం రూరల్ పర్యటనలో మంత్రి పొంగులేటి**

ఖమ్మం రూరల్, జూన్ 23: అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని, రేషన్‌కార్డులు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కానీ అదే సమయంలో అనర్హులు పొందుతున్న పింఛన్లను రద్దు చేస్తామని, రేషన్ కార్డులను తొలగిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదల ప్రభుత్వమని అన్నారు. ప్రభుత్వ పథకాల్లో పేద కుటుంబాలకే ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని కైకొండాయిగూడెం, టీఎన్‌జీవోస్‌కాలనీ, సాయిగణేశ్‌నగర్, సాయిప్రభాత్‌నగర్, నాయుడుపేట, ఆరెంపుల గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆయన.. ఆయా గ్రామాల ప్రజల నుంచి స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం నాయుడుపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వచ్చే ఏడాదిలోపు గ్రామాల్లోని ప్రతీ వీధిలో సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. మూడేళ్లలోపు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని అన్నారు. అనంతరం మిగిలిన వారికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. జూలై 1 నుంచి ఆగస్టు చివరిలోపు అర్హత కలిగిన ప్రతి రైతుకూ రూ.2 లక్షల్లో పంట రుణాలను మాఫీ చేస్తామన్నారు. అధికారులు ఆర్‌డీవో గణేశ్, ఎంపీవో రాజారావు, ఐబీ ఈఈ వెంకటేశ్వర్లు, ఎంఈవో శ్యాంసన్, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఆరెంపుల సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## పద్మశ్రీ 'సకిని' కన్నుమూత

**గొంతు సంబంధ వ్యాధితో బాధపడుతూ తుదిశ్వాస విడిచిన రామచంద్రయ్య**

**నివాళులర్పించిన కలెక్టర్, సంతాపం తెలిపిన మంత్రులు**


సకిని రామచంద్రయ్య (ఫైల్)


పూలమాలతో నివాళులర్పిస్తున్న కలెక్టర్

మణుగూరు టౌన్, జూన్ 23:డోలు వాయిద్యకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య (65) భద్రాద్రి జిల్లా మణుగూరులో కన్నుమూశారు. గొంతు సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన.. ఆదివారం ఇక్కడి కూనవరంలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. తెలంగాణ వనదేవతల జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వైభవాన్ని ఆదివాసీ గ్రామాలకు వెళ్లి ఆయన వివరించేవారు. కనీస సౌకర్యాలు లేని గ్రామాలకు కూడా కాలినడకన వెళ్లి మరీ వనదేవతల చరిత్రను కళారూపంలో చాటి చెప్పేవారు. డోలు వాయిద్యకారుడైన ఈయనను 2022 జనవరి 26న కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి 2022 మార్చి 28న ఢిల్లీలో ఆయన పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. డోలువాయిద్య కళాకారుడు తెలుగు రాష్ట్రాల్లో సకిని రామచంద్రయ్య ఒక్కరే కావడం విశేషం.

**మంత్రుల సంతాపం.. కలెక్టర్ నివాళి..**

పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మరణవార్త తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ, రెవెన్యూ శాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు. భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కూడా మణుగూరులోని కూనవరంలో ఉన్న రామచంద్రయ్య నివాసంలో అతడి పార్థీవదేహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. 2022లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి ఆర్థిక సాయం, జిల్లా కేంద్రంలో 426 గజాల స్థలం కేటాయింపు సమస్యను వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే అంత్యక్రియల అనంతరం తనను కలవాలని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వారికి హామీఇచ్చారు. అదే విధంగా అనాదిగా వస్తున్న డోలు వాయిద్య కళను అంతరించిపోకుండా చర్యలు తీసుకుంటానని మాట ఇచ్చారు. కాగా, సకిని రామచంద్రయ్యకు భార్య బాపనమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఒక కుమారుడు కాలేయ సంబంధ వ్యాధితో 2008లో మరణించిన విషయం విదితమే.

## యానంబైలుకు మోక్షమెప్పుడు?

- గత కేసీఆర్ ప్రభుత్వంలోనే చివరికి దశకు చేరిన వంతెన నిర్మాణం
- కొత్త ప్రభుత్వం వచ్చి 7 నెలలు దాటినా ఇంకా మీనమేషాలు?
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన కొనసాగుతున్న పనులు
- భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంత ప్రజలకు తిప్పలు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలం వస్తే చాలు.. అక్కడి ప్రజలకు తిప్పలు తప్పవు. బాహ్య ప్రపంచంతో సంబంధాలూ ఉండవు. రాకపోకలకు అంతరాయం. లేదంటే అతికష్టమ్మీద మరో పది కిలోమీటర్ల చుట్టూ ప్రయాణం. ఇదీ.. కిన్నెరసాని ప్రాజెక్టు దిగువన ఉన్న 20 గ్రామాల పరిస్థితి. ఈ పరిస్థితి గమనించిన గత కేసీఆర్ ప్రభుత్వం అప్పట్లోనే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఎన్నికలు సమీపించడం, నియమావళి సహా ఇతరత్రా కారణాలతో పనులు అక్కడే ఆగిపోయాయి. ఇక కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు దాటినా ఆ వంతెన నిర్మాణ పనులు మొదలైన పాపాన పోలేదు.

### ఇంకా మీనమేషాలు?

భారీ వర్షాలకు కిన్నెరసాని ప్రాజెక్టులోకి ఏటా వరద నీరు చేరుతుంటుంది. దీంతో రాజాపురం– యానంబైలు మధ్యలో ఉన్న లోలెవల్ కాజ్‌వే నీట మునిగిపోతుంటుంది. దీంతో పరిసర గ్రామ ప్రజలు మండల కేంద్రమైన పాల్వంచకు గానీ, అత్యవసర పనులపై ఇతర ప్రాంతాలకు గానీ రాకపోకలు సాగించేందుకు అంతరాయం కలుగుతుంది. మరీ అత్యవసరమైతే కిన్నెరసాని డ్యామ్‌పైన ఉన్న వంతెన నుంచి తిరిగి రావాలి. లేదంటే పది కిలోమీటర్ల దూరం వెళ్లి పాల్వంచకు చేరుకోవాలి. ఎన్నో ఏళ్ల ఈ సమస్యపై గత కేసీఆర్ ప్రభుత్వం దృష్టిపెట్టింది. రూ.10 కోట్ల నిధులతో యానంబైలు వద్ద వంతెన నిర్మాణం చేపట్టింది. 2023 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. ఎన్నికల నియమావళి సహా వివిధ కారణాలతో పనులు ఆగిపోయాయి. కానీ.. నూతన ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు నత్తనడకన కొనసాగుతున్నా మీనమేషాలు తప్ప ఆచరణ లేకపోయింది. అలాగే, సుజాతనగర్ మండలం వేపలగడ్డ వద్ద చేపట్టిన భారీ వంతెన నిర్మాణ పరిస్థితి కూడా ఇలాగే ఉంది.


భారీ వర్షాలకు ఏటా నీట మునిగే యానంబైలు పాత చప్టా (ఫైల్)


పాల్వంచ మండలం కిన్నెరసాని రాజాపురం యూనంబైలు వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన



### 20 గ్రామాలకు రాకపోకలు ప్రశ్నార్థకమే..

ముక్కు ఎక్కడుందిరా అంటే తలచుట్టూ తిప్పి చూపించనట్టుగా అవుతుంది యానంబైలు పరిసర ప్రాంతాల ప్రజల పరిస్థితి. యానంబైలు పరిసర ప్రాంతాల్లోని 20 గ్రామాల ప్రజలు పాండురంగాపురం నుంచి మండల కేంద్రమైన పాల్వంచకు, ఆపై బాహ్య ప్రపంచానికి వెళ్లాల్సి ఉంటుంది. ఏటా వరదలకు, భారీ వర్షాలకు యానంబైలు చప్టా మునుగుతుంది. అందుకే గత కేసీఆర్ ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టింది. ఇప్పుడిది పూర్తి కాకుంటే ఈ 20 గ్రామాల ప్రజలకు ఈ ఏడాది కూడా నరకమే. యానంబైలు, ఉల్వనూరు, రేగులగూడెం, మొండికట్ట, రెడ్డిగూడెంతోపాటు మరో పది గ్రామాల ప్రజలు పాల్వంచకు వెళ్లలేరు. రాకపోకలు ప్రశ్నార్థకమవుతాయి.

### వరదొస్తే పాల్వంచకు వెళ్లలేం..



వర్షాలకు వరదలొస్తే మా గ్రామం నుంచి పాల్వంచ వెళ్లలేం. ఎంత కష్టమొచ్చినా భరించి ఇక్కడే ఉండాలి. వరద తగ్గాకే వెళ్లాల్సి ఉంటుంది. మంచి నాయకులు ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. మాకు శనిలా ఉండే నాయకులు వస్తే ఇలానే ఉంటుంది. ఇన్ని రోజులుగా బ్రిడ్జిని కడుతూనే ఉన్నారు. పాలకులుగానీ, అధికారులుగానీ మా ఊరికి వస్తే తెలుస్తుంది మా కష్టాలేమిటో.

**–సిరసాని రంగారావు, యానంబైలు, పాల్వంచ మండలం**

### మా కష్టాలను పట్టించుకోవట్లేదు..



సరైన వంతెన లేక మేము పడుతున్న కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. అటు పాలకులు గానీ, ఇటు అధికారులుగానీ కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. కనీసం మా ఊరు ఊరంతా కొటుకుపోతేనైనా మా కష్టాలు తెలుస్తాయో ఏమో అనిపిస్తుంది. ఇన్నేళ్లుగా కష్టాలు పడుతూనే ఉన్నాం. బ్రిడ్జి వచ్చిందనుకుంటే ఆ కాంట్రాక్టరేమో ఇప్పటికీ పూర్తి చేయట్లేదు.

**–రమేశ్‌గౌడ్, యానంబైలు, పాల్వంచ మండలం**